## సంపాదకీయం

**బుధవారం 11-06-2025**

# జడలు విప్పిన బెట్టింగ్ భూతం

యూపీఐ వ్యవస్థ మార్చి, ఏప్రిల్ నెలల్లో పలుమార్లు స్తంభించింది. ఐపీఎల్ బెట్టింగ్ లావాదేవీల ఒత్తిడి వల్లే ఇలా జరిగిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. భారతీయ బ్యాంకింగ్ రంగ సామర్థ్యానికి పరీక్ష పెట్టిన ఈ ఆన్‌లైన్ జూదం- అనేక మధ్యతరగతి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేసింది. జీవితాలను తలకిందులు చేస్తున్న బెట్టింగ్ భూతాన్ని ప్రభుత్వాలు ఇప్పట్లో కట్టడిచేసే సూచనలేవీ కనిపించడం లేదు.యూపీఐ వ్యవస్థ మార్చి, ఏప్రిల్ నెలల్లో పలుమార్లు స్తంభించింది. ఐపీఎల్ బెట్టింగ్ లావాదేవీల ఒత్తిడి వల్లే ఇలా జరిగిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. భారతీయ బ్యాంకింగ్ రంగ సామర్థ్యానికి పరీక్ష పెట్టిన ఈ ఆన్‌లైన్ జూదం- అనేక మధ్యతరగతి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేసింది. జీవితాలను తలకిందులు చేస్తున్న బెట్టింగ్ భూతాన్ని ప్రభుత్వాలు ఇప్పట్లో కట్టడిచేసే సూచనలేవీ కనిపించడం లేదు. మరి దీన్నించి తప్పించుకోవడం ఎలా?రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-2025 విజేతగా నిలిచింది. దాదాపు రెండున్నర మాసాలపాటు కోట్ల మంది క్రికెట్ అభిమానులకు వేసవి వినోదం పంచిన ఈ క్రీడా సంరంభం వెనక ఓ చీకటి కోణమూ ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌ల గెలుపోటములపై తెరవెనక సాగిన వికృత క్రీడలో బెట్టింగ్ మాఫియా గెలిచింది. మధ్యతరగతి ఘోరంగా ఓడిపోయింది. సరదాగా మొదలుపెట్టి, తేరగా డబ్బులు వచ్చేస్తాయన్న ఆశతో క్రమంగా బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకుపోయినవారెందరో! దిక్కుతోచని స్థితిలో రుణాలు తీర్చేందుకు క్రెడిట్ కార్డులు, లోన్ యాప్‌లను ఆశ్రయిస్తూ సమస్యను మరింత జటిలం చేసుకుంటున్నారు. ఈ ఊబి నుంచి ఎలా బయటపడాలో తెలియక, ఇంట్లో వారికి చెప్పలేక మానసిక సంఘర్షణతో క్షణక్షణం నరకం అనుభవిస్తున్నారు.

మధ్యతరగతికి వల

సాంకేతికతను ఆసరా చేసుకుని ఆధునిక జూదం విజృంభిస్తోంది. ప్లేస్టోర్లలో లభ్యమయ్యే పలు యాప్‌లకు తోడు అనేక వెబ్‌సైట్లు వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా మధ్యతరగతికి వల విసురుతోంది. ఏడాదికి ఒకటి రెండుసార్లు కనిపించే 'బెట్టింగ్‌లో రూ.కోటి గెలుచుకున్న కూలీ' లాంటి కథనాలను చూసి- ఓ రాయి వేసి చూద్దామనే ధోరణితో చాలామంది బెట్టింగ్ మొదలుపెడుతున్నారు. కానీ, దానికి బానిసలుగా మారడానికి వారికి ఎంతోకాలం పట్టడం లేదు. బెట్టింగ్ మాఫియాకు మాత్రం కాసుల పంట పండుతోంది. ఒక నివేదిక ప్రకారం- భారత్‌లో జూదం ద్వారా ఏటా రూ. 8.50లక్షల కోట్లకు పైగా చేతులు మారుతున్నట్లు అంచనా. వ్యవస్థాగత లోపాలు, నియంత్రణపై పాలకుల మీనమేషాలు వెరసి ఆన్‌లైన్ జూదం విజృంభణకు దారితీస్తున్నాయి. భారత్‌లో నైపుణ్య ఆధారిత ఆన్‌లైన్ గేమింగ్‌కు చట్టబద్ధత ఉంది. రూ. 34,225 కోట్ల విలువైన ఈ రంగం ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఏటా రూ. 12వేల కోట్లు సమకూరుతున్నాయి. లక్షన్నర మందికి ఉపాధి లభిస్తోంది. మరింత విస్తరణకు అవకాశం ఉన్న ఈ రంగంపై ప్రభుత్వానికి కొంతమేర నియంత్రణ ఉంది. కానీ, ఈ వ్యవస్థకు సమాంతరంగా మరో చీకటి ప్రపంచం నడుస్తుండటమే ఇప్పుడు పెను ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. భారతీయ చట్టాలకు చిక్కకుండా విదేశాల నుంచే కొందరు ఈ దందాను నడిపిస్తున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు మొదలు అంతర్జాతీయ స్థాయిలో క్రిప్టోకరెన్సీ నెట్‌వర్క్ వరకు విస్తృతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. అనామకుల పేరిట బ్యాంకుల్లో 'మ్యూల్ ఖాతాలు' తెరిచి, వాటి ద్వారా బెట్టింగ్ లావాదేవీలు సాగిస్తున్నారు. ఐపీఎల్-2025 మొదలైన తొలిరోజుల్లో యూపీఐ నాలుగుసార్లు స్తంభించింది. బెట్టింగ్ లావాదేవీలే ఇందుకు కారణమన్న విశ్లేషణలు వచ్చాయి. ఈ ఒత్తిడిని తట్టుకునేందుకు బ్యాంకులు యుద్ధప్రాతిపదికన నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయనే కథనాలూ వెలువడ్డాయి.ఆన్‌లైన్ బెట్టింగ్‌ను కొన్ని రాష్ట్రాలు నిషేధించినా, వ్యవస్థలోని లొసుగుల వల్ల ఆ ముఠాలు రెచ్చిపోతున్నాయి. ప్రస్తుతం కోర్టుల్లో ఈ వ్యవహారమంతా 'గేమ్ ఆఫ్ ఛాన్స్ వర్సెస్ గేమ్ ఆఫ్ స్కిల్' అనే వాదనల చుట్టూ తిరుగుతోంది. ఇది చివరికి ఎక్కడకు దారితీస్తుంది, ఆన్‌లైన్ బెట్టింగ్‌ను పూర్తిగా నిషేధించడం సాధ్యమేనా అనేవి ప్రస్తుతానికి అంతుచిక్కని ప్రశ్నలే! ఈ విషయంలో పాలకుల చిత్తశుద్ధిని పూర్తిగా నమ్మలేం. రూ. 6వేల కోట్ల మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ విచారణ ఎదుర్కోవడం ఇందుకో ఉదాహరణ. ప్రభుత్వ పన్ను రాబడి లెక్కలు, నేతల స్వప్రయోజనాలు బెట్టింగ్ నిషేధానికి ప్రతిబంధకాలు అవుతున్నాయి. ఈలోగా సామాన్యుడికి అంతులేని నష్టం జరిగిపోతోంది.

అదంతా సైకలాజికల్ గేమ్

బెట్టింగ్ సంస్థలు సామాన్యులతో సైకలాజికల్ గేమ్ ఆడతాయి. బెట్టింగ్ మొదలుపెట్టిన రోజుల్లో అడపాదడపా చిన్నపాటి విజయాలు వరిస్తాయి. అనూహ్య విజయాలతో ఆడేవారి మెదడులో డోపమైన్ విడుదలవుతుంది. దాంతో మనసు ఉత్తేజితమవుతుంది. అక్కడి నుంచి డోపమైన్ మళ్లీమళ్లీ అదేపని చేయిస్తుంది. వ్యాయామం, ట్రెక్కింగ్ వంటి సాహసాలు చేయడం, సంగీతం వినడం, కుటుంబసభ్యులూ స్నేహితులతో సరదాగా గడపడం వంటివి కూడా డోపమైన్ విడుదలకు దోహదపడతాయి. బెట్టింగ్‌లో గెలిచినంతటి ఉత్తేజకర అనుభూతే కలుగుతుంది. ఇక్కడ ఆన్‌లైన్ జూదం ఆడాలనుకునేవారు నిర్ణయించుకోవాల్సింది- బెట్టింగ్‌తో ఆర్థికంగా చితికిపోవడమా, సన్నిహితులతో సరదాగా గడపటమా అనేదే!

# తొలిసారి ఎమ్మెల్యే.. తొలిసారే మంత్రి..



మహబూబ్‌నగర్: రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో మరో పాలమూరు వాసికి చోటు దక్కింది. వ్యవసాయ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి.. అంచెలంచెలుగా ఎదిగిన మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని అమాత్య పదవి వరించింది. ఈ మేరకు హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆదివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు మంత్రి పదవి రావడంతో బీసీ సంఘాలతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. తాజాగా వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కడం పాలమూరుకు వరమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

తొలిసారి ఎమ్మెల్యే.. తొలిసారే మంత్రి..

2023 ఎన్నికల్లో మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వాకిటి శ్రీహరి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీచేసి గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయన.. వెంటనే మంత్రి పదవి చేపట్టి ఘనత సాధించారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి ఎల్కోటి ఎల్లారెడ్డి (మక్తల్), పి.చంద్రశేఖర్ (మహబూబ్‌నగర్), చిత్తరంజన్‌దాస్ (కల్వకుర్తి), శ్రీనివాసరావు (నాగర్‌కర్నూల్), పులి వీరన్న (మహబూబ్‌నగర్)కు ఈ అవకాశం దక్కగా.. శ్రీహరి వారి సరసన చేరడం విశేషం. కాగా, వాకిటి శ్రీహరితో పాటు ఆయన కుటుంబసభ్యులందరూ విద్యావంతులే. శ్రీహరితో పాటు ఆయన భార్య, ఆయన తమ్ముడు, మరదలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజాసేవలోనే ఉన్నారు.

వ్యవసాయ కుటుంబం నుంచి..

మక్తల్ పట్టణం నేతాజీ నగర్‌కు చెందిన వాకిటి శ్రీహరిది తొలుత వ్యవసాయ కుటుంబం కాగా.. కాంగ్రెస్‌లో చేరి క్రమక్రమంగా రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌తో పాటు పార్టీలో మండల, ఉమ్మడి జిల్లా, విభజన అనంతరం నారాయణపేట జిల్లాలో వివిధ హోదాల్లో సేవలందించారు. వాకిటి శ్రీహరి తల్లి రాములమ్మ స్టాఫ్ నర్స్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. స్థానికంగా వేలాది మంది నిరుపేద మహిళలకు ఉచితంగా కాన్పులు చేసి రాములమ్మ సిస్టర్‌గా పేరు సాధించారు. తండ్రి వాకిటి నరసింహులు వ్యవసాయంతో పాటు చిన్నపాటి కాంట్రాక్టర్‌గా పనిచేశారు. వీరికి మొత్తం ఆరుగురు సంతానం కాగా.. నాలుగో కాన్పులో శ్రీహరి జన్మించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్న ఆయన డిగ్రీ (బీఏ) దాకా విద్యాభ్యాసం కొనసాగించారు. 1996లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన మక్తల్ సర్పంచ్‌గా, జెడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తాజాగా సామాజిక సమీకరణాల్లో భాగంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలోకి తీసుకుంది.

మంత్రి శ్రీహరిని సన్మానించిన ఎమ్మెల్యే యెన్నం

రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిట శ్రీహరిని ఆదివారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, ముకుందం రమేష్ పాల్గొన్నారు.

విధేయత.. సామాజిక సమీకరణాలు..

వాకిటి శ్రీహరి విద్యార్థి దశలో యూత్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఆ పార్టీలోనే కొనసాగారు. సుదీర్ఘకాలంగా పార్టీకి విధేయుడిగా ముద్రపడిన ఆయనకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో మంచి సాన్నిహిత్యం ఉంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను మక్తల్ నియోజకవర్గంలో విజయవంతం చేసి ప్రశంసలు పొందారు. దీంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన క్రమంలో మంత్రివర్గంలో బీసీలకు, అందులోనూ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారికి చోటు కల్పించాలన్న డిమాండ్ పెరిగింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ సైతం ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన ఎమ్మెల్యేలలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీహరి ఒక్కరే కాగా.. విధేయత, సామాజిక సమీకరణాలు ఆయనకు కలిసి వచ్చాయని.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని కాంగ్రెస్ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

రాజకీయ నేపథ్యం..

- వాకిటి శ్రీహరి 1990 నుంచి 1993 వరకు ఎన్ఎస్‌యూఐ మక్తల్ మండల ప్రెసిడెంట్‌గా.. 1993-1996 వరకు యూత్ కాంగ్రెస్ మక్తల్ మండల అధ్యక్షుడిగా.. 1996 నుంచి 2001 వరకు మక్తల్ మండల కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు.
- 2001-2006 వరకు మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించి రికార్డుల్లోకెక్కారు.
- 2001-2006 ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు.
- 2006 నుంచి 2011 వరకు వాకిటీ శ్రీహరి సతీమణి వాకిటి లలిత దాసర్‌పల్లి ఎంపీటీసీ సభ్యురాలిగా ఉన్నారు. 2006 నుంచి 2011 వరకు ఆమె కాంగ్రెస్ మక్తల్ మండల అధ్యక్షురాలిగా పనిచేశారు.
- 2006 నుంచి 2012 వరకు వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా.. 2006 నుంచి 2014 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.
- 2014 నుంచి 2018 వరకు వాకిటి శ్రీహరి మక్తల్ జెడ్పీటీసీ సభ్యుడిగా సేవలందించారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనే రెండో మెజార్టీ స్థానంలో నిలిచారు. 2014 నుంచి 2018 వరకు కాంగ్రెస్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా.. 2014 నుంచి 2018 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.
- 2018 నుంచి వాకిటి శ్రీహరి కృష్ణా జలాల పరిరక్షణ సమితి సభ్యుడిగా ఉన్నారు. పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి పనిచేశారు.
- 2019లో వాకిటి శ్రీహరి సోదరుడి భార్య రాధిక మక్తల్ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు.

# భర్త రఘువంశీ హత్యకు భార్యనే కుట్ర

న్యూఢిల్లీ,భార్యతో కలిసి హనీమూన్ కు వచ్చిన ఇండోర్ వ్యక్తి మేఘాలయలో దారుణ హత్యకు గురైన ఘటనలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. భార్యనే భర్త హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్‌లో అతని భార్యను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. మేఘాలయ డీజీపీ ఇదాషిషా నోంగ్‌రాంగ్ మాట్లాడుతూ.. 28 ఏళ్ల రాజా రఘువంశీ హత్యకు భార్య సోనమ్ హనీమూన్ సమయంలో హంతకులను నియమించుకుని కుట్ర పన్నారని తెలిపారు. ఇటీ-వల వివాహం చేసుకున్న ఈ జంట మే నెలలో మేఘాలయకు చేరుకుని అక్కడి అందమైన ప్రదేశాలను సందర్శించారు. వారు చివరిసారిగా మే 23న సోహ్రా ప్రాంతంలో కనిపించారు. తర్వాత వారు కనిపించ కుండా పోయినట్లు- వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఈ క్రమంలో జూన్ 2న చిరపుంజి సమీపంలోని సోహ్రారిమ్ వద్ద ఉన్న లోయలో రాజా రఘువంశీ మృతదేహం కనుగొన్నారు. ఆ జంట అదృశ్యమైన రోజున మరో ముగ్గురు వ్యక్తులతో కనిపించారని స్థానిక టూరిస్ట్ గైడ్ పోలీసులకు చెప్పాడు. తర్వాత 17 రోజులుగా కనిపించకుండా పోయిన సోనమ్ ను ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లోని రోడ్డు పక్కన ఉన్న ఓ తినుబండారంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రజా హత్య కేసులో ఏం జరిగిందనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మేఘాలయలో ఇండోర్ జంట అదృశ్యం కేసులో భార్యను ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో ఈ కేసు కీలకమలుపు తిరిగింది. కాంట్రాక్ట్ కిల్లర్లకు సుపారీ ఇచ్చి భర్త రాజా రఘువంశీని సోనమ్ చంపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే తన కుమార్తె అమాయకురాలిని ఆమె తండ్రి దేవీసింగ్ పేర్కొన్నారు. నా కుమార్తెకు ఏ పాపం తెలియదు. నా బిడ్డపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఆమె అలా చేసి ఉండదు. ఇరుకుటుంబాల సమ్మతితోనే వారి పెళ్లి జరిగింది. గాజీపుర్‌లోని రోడ్డుపక్కన ఒక హోటల్ వద్దకు ఆమె చేరుకుంది. అప్పుడు ఏడుస్తూనే ఉంది. అక్కడినుంచి ఫోన్ చేసి, తన లొకేషన్ చెప్పింది. పోలీసులు అక్కడికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఇంతవరకు నేను నా కుమార్తెతో మాట్లాడలేదు. ఆమె అలా ఎందుకు చేస్తుంది. మేఘాలయ పోలీసులు అబద్ధం చెప్తున్నారు. నా కుమార్తె తనంతటతానుగానే గాజీపుర్‌కు వచ్చింది. ఆమెను మేఘాలయలో అరెస్టు చేయలేదు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నానని వాపోయారు. ఇన్ని రోజులకు తన కుమార్తె ప్రాణాలతో బయటపడినందుకు సోనమ్ తల్లి ఊపిరి పీల్చుకున్నారు. అయితే అల్లుడి హత్య వెనక ఎవరున్నారో తెలుసుకోవాలని అనుకుంటున్నామని అన్నారు. రాజా రఘువంశీ కుటుంబం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. అయితే, ఈ జంట మే 22న ఓ ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకొని మౌలాకియాత్ అనే గ్రామానికి చేరుకున్నట్లు- మేఘాలయ అధికారులు తెలిపారు. అక్కడే వారి ఆచూకీ గల్లంతు కాగా.. 11 రోజులకు రఘువంశీ మృతదేహం బయటపడింది. తాజాగా సోనమ్ ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయింది. ఆమెకు సహకరించిన మరో ముగ్గురిని కూడా అరెస్టు చేసినట్లు- తెలిపారు. రఘువంశీని చంపేందుకు అతడి భార్య సోనమ్ తమకు సుపారీ ఇచ్చినట్లు- నిందితులు విచారణలో వెల్లడించారు. ఆమెకు రాజ్‌కుశ్వాహ్ అనే వ్యక్తితో సంబంధం ఉందని, దాంతో ఆమె తన భర్త హత్యకు కుట్ర పన్నిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. సోనమ్ మాకు కాల్ చేసింది. మా సమాచారంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె చాలా భయపడిపోయింది. సోనమ్ లొకేషన్ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉంది. మధ్యప్రదేశ్‌లో ఇతర అనుమానితుల్ని అరెస్టు చేశారు. ఇక్కడ చాలా తేడా కనిపిస్తోంది. ఆమె చెప్పిన తర్వాతే ఏం జరిగిందనే దాన్ని మేం నమ్ముతాం అని మృతుడి సోదరుడు విపిన్ మీడియాకు వెల్లడించారు.

# స్కూళ్లు తెరిచే వేళ...నిర్లక్ష్యం వీడాలి!

హైదరాబాద్,మరో రెండు రోజుల్లో పాఠశాలలు తెరవబోతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా పరిస్థితి ఉంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం ఎప్పటి లాగేనే ఇప్పటికే ఫీజులు వసేలు చేసేసుకున్నాయి.లక్షల్లో ఫీజలలో విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. తల్లిదండ్రులు ఆందోలనలు గాలిలో కలిసి పోయాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలకుల ప్రైవేట్ ఫీజుల దోపిడీని కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా.. ఆచరణలో మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. ఫీజుల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. కార్పోరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. బిఆర్ఎస్ హయాంలో తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్కలేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు. ప్రభుత్వాలు మారి రేవంత్ రెడ్డి, చంద్రబాబులు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ఎపిలో టెన్త్ మూల్యాంకనంలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. దీనిని బయటకు పెద్దగా పొక్కకుండా మేనేజ్ చేశారు. ఇలా విద్ఆయరంగంలో అవతకవలు మొదలు, ఫీజుల మోత, సౌకర్యాల విషయంలో ప్రభుత్వాలు పెద్దగా దృష్టి సారించడం లేదు. ఇకపోతే పరీక్షల్లో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై హైదరాబాద్‌లో ఏటా తల్లిదండ్రులు ఆందోళన చేసిన ఫలితం కానరాలేదు. ఏటా ఇది జరుగుతూనే ఉంది. అయినా ఫీజుల దోపిడీ పెరగుతోందే తప్ప ఆగడం లేదు. లెక్కాపత్రం లేకుండా వసూలు చేస్తున్న మొత్తాలతో మధ్యతరగతి ప్రజలు కుదేలవు తున్నారు. నిజానికి తెలంగాణలో కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తానని ఆనటి సిఎం కెసిఆర్ పలుమార్లు ప్రకటించారు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యా విధానంలో చదవాలన్న ఆకాంక్షను ప్రకటించారు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇలా కబుర్లు చెప్పి,ప్రజలను నమమించి బురిడీ కొట్టించారు. నిజానికి కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. స్కూళ్లను ఇంటిగ్రేడ్ చేస్తామని, కులరహిత హాస్టళ్లు తొలగిస్తామని చెప్పినా..కార్యరూపం దాల్చడం లేదు. కొత్తగా గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, కులాలా వారీగా అనేక హాస్టళ్లను కొత్తగా చేప్టటడం వల్ల విద్యారంతంలో సంస్కరణలు అటకెక్కించారనే భావించాలి. ఎపిలో సర్కార్ స్కూళ్లను బాగుచేస్ఆమని, విద్యాదీవెనతతో కిట్లు ఇస్తున్నామని చెప్పారు. ఇకపోతే హైదరాబాద్, తదితర పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి



తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థులకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్సహించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి. క్రీడలకు సరైన ప్రోత్సహకాలులేక ఎంతోమంది భావిక్రీడాకారులు మట్టిలో మాణిక్యాల వలే మిగిలిపోయారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అందుకే అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు కల్పించాలి. దాని వల్లనే కార్పోరేట్ విద్యాసంస్థల పెత్తనాన్ని అడ్డుకోవచ్చు. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్‌ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం ద్వారా భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే గలిగేలా చేయాలి. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోత్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాల కారణంగా క్రీడారంగం వెనకబడింది. విద్యాసంస్థలు సైతం వీటిని ప్రోత్సహిం చడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యం వర్తించే విధంగా చూడాలి. ఈ క్రమంలో పాఠశాలలను బలోపేతం చేసి, ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టేలా కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రైవేట్ పెత్తనం పోగలదు. విద్యారంగం పురోగతికి ఇదే తక్షణ అవసరమని ప్రభుత్వాలు గుర్తించాలి.

# టీడీపీకి దిక్కెవరు?

తిరుపతి:రాష్టంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన నియోజకవర్గాల్లో తిరుపతి ఒకటి.. అలాంటి చోటా టీడీపీకి దిశా నిర్దేశం చేసే నాయకుడు లేక పోవడంతో.. వైసీపీ వ్యూహాత్మక దాడులు చేస్తూ అధికారం ఎవరిదైనా.. తమనెవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో చెలరేగిపోతోంది. దాంతో పాటు క్షేత్ర స్థాయిలోని ఇంటలిజెన్స్, కీలక స్టేషన్లలో ఎస్ఐలతో పాటు పోలీసుల సహాకారం ఉండటంతో యదేచ్చగా వారు దాడులకు సైతం దిగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తునాయి .. తాజాగా తిరుపతిలో జరిగిన ఘటనలు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయని.. తెలుగు తమ్ముళ్లు గగ్గోలు పెడుతున్నారు.

తిరుపతిలో జనసేన బాట పట్టిన వైసీపీ శ్రేణులు

తిరుపతిలో తాజాగా జరిగిన ఘటనలు వైసీపీ దూకుడుకు అద్దం పడుతున్నాయి. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేన కావడంతో .. పెద్దఎత్తున వైసీపీ శ్రేణులు ఆ పార్టీ పంచకు చేరి అధికార కూటమి సభ్యులుగా పెత్తనం చెలాయిస్తున్నారంట.. తమకు తిరుగలేదన్నట్లు వ్యవహారిస్తున్నారంట.. తిరుపతికి సంబంధించి వైసీపీ హయాంలోచక్రం తిప్పిన చైతన్యయాదవ్ అతని బ్యాచ్ మూడో తేదీన కారు డెకార్స్ యాజమానిని చితకబాదారు. దానికి సంబంధించిన సిసి పుటేజ్ సోషియల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతుంది.

వైసీపీ దాడులపై స్పందించని టీడీపీ నేతలు

దాంతో పాటు ఎస్‌టివి నగర్‌లో అయితే ఏకంగా టిడిపి దిమ్మెపై ఆ పార్టీ జెండాను తీసివేసి వైసిపి వారు వారి జెండాను ఎగరవేశారు. ఆ రెండు ఘటనలపై టిడిపి నుంచి స్థానిక చోటా మోటా నాయకులు స్పందించారు కాని తిరుపతిలో అగ్ర నాయకులు అని చెప్పుకునే వారెవరూ స్పందించలేదు. అవి పోలీసులు చూసుకోవాల్సిన వ్యవహారాలంటూ సోకాల్డ్ నాయకులు సైడ్ అయిపోతున్నారంట. ఎన్నికలు జరిగి ఏడాదికి పైగా పూర్తైనా తిరుపతిలో టీడీపీకి ఇన్ చార్జ్ నియామకం జరగలేదు.. ఇన్‌చార్జ్‌గా వ్యవహారిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు ఇటీవల కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. దాంతో ఆమె పూర్తిగా సైలెంట్ అవ్వడంతో సొంత పార్టీ వారే పట్టించుకోవడం మానేసారంట .నామినేటెడ్ పదవితో సైలెంట్ అయిన నరసింహయాదవ్

తిరుపతి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు అయిన నరసింహయాదవ్‌కు నామినేటెడ్ పదవి దక్కించుకుని పార్టీ వ్యవహరాలను పట్టించుకోవడం లేదంట. ఆ క్రమంలో నలుగురు ఔత్సాహికులు పార్టీ ఇన్‌చార్జ్ పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. పదవి కోసం తమ ప్రయత్నాల్లో తాము బీజీగా ఉన్నారు. ఇలాంటి స్థితిలో క్యాడర్ గురించి ఆలోచించే నాథుడే కరువయ్యాడంట. పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మిగతా నియోజకవర్గాలలో పూర్తి అయింది. అయితే తిరుపతిలో మాత్రము పూర్తి కావడం లేదు. పేరుకి పాత కార్యవర్గం కొనసాగుతోంది కాని యాక్టివ్‌గా లేదు. నాయకులమని చెప్పుకునే వారంతా ఎవరి దారి వారిదన్నట్లు వ్యవహరిస్తుండటంతో తెలుగుతమ్ముళ్లకు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియకుండా తయారైందంట.

## జర్నలిస్టు కృష్ణంరాజుపై చర్యలు తీసుకోండి


విజయవాడ,విజయవాడ పోలీసు కమిషనర్‌ని ఎన్డీఏ కూటమి మహిళా నేతలు సోమవారం కలిశారు. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజుపై సీపీకి ఫిర్యాదు చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని మహిళలను అభ్యంతరకరంగా దూషించిన కృష్ణంరాజుని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సీపీకి వినతి పత్రం ఇచ్చారు. సీపీని కలిసిన వారిలో టీడీపీ ఏపీ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆషా, బీజేపీ మహిళా నాయకురాలు బొడ్డు నాగలక్ష్మి, జనసేన నుంచి రవి సౌజన్య, కూటమి మహిళా నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా కూటమి మహిళా నేతలు మీడియాతో మాట్లాడారు. రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. రైతులు చేసిన త్యాగానికి ఈ రోజు కృష్ణంరాజు, కొమ్మినేని మాటలు చాలా దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షి డిబేట్‌లో రాజధాని అమరావతి మహిళల గురించి అభ్యంతరకరంగా మాట్లాడారని వాపోయారు. కృష్ణంరాజు, కొమ్మినేని అలా మాట్లాడటం సరికాదని చెప్పారు. సాక్షి మీడియాకి మొదటి నుంచి రాజధాని అమరావతిపై ఒక చిన్న చూపు ఉందని మండిపడ్డారు. రైతులు చేసిన త్యాగం మరువకూడదని చెప్పుకొచ్చారు కూటమి మహిళా నేతలు. ఆ రాజధాని ప్రాంతంలోనే వైఎస్ భారతిరెడ్డి కూడా ఉన్నారు.. ఇప్పటి వరకు సాక్షి మీడియా ఎందుకు ఖండించలేదని కూటమి మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలోని మహిళల గురించి ఈ విధంగా మాట్లాడటం దారుణమని అన్నారు. ఇప్పటికి కొమ్మినేనిని అరెస్టు చేశారు..కృష్ణంరాజుని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణంరాజుని వెంటనే అరెస్ట్ చేస్తామని విజయవాడ పోలీసు కమిషనర్ అన్నారని తెలిపారు. జగన్ తమ రాజధానిలో మా భార్య, పిల్లలు కూడా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోని మాట్లాడాలని అన్నారు. జగన్ ఎలా మాట్లాడాలో మంత్రి లోకేష్‌ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. సాక్షి మీడియా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న భారతిరెడ్డి ఇప్పటివరకు ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని కూటమి మహిళా నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు దగ్గర పడడంతో భక్తులు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో వస్తున్నారు. ఆదివారం ఉదయం స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్స్ పూర్తిగా నిండిపోయి.. వెలుపల క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. సోమవారం కూడా రద్దీ కొనసాగింది. 88,257 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా.. 45,068 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు- అని టీటీడీ అధికారులు వెల్లడించారు. ఓవైపు వేసవి సెలవులు ముగియనుండడం, మరోవైపు వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రతి రోజు వేలాది మంది భక్తులు తిరుమలకు వస్తున్నారు. మరో వారం రోజుల పాటు- భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు.

# మణిపూర్‌లో ఎంతకాలం ఈ మంటలు?

మణిపూర్ :ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మళ్లీ మండుతోంది. మెయితీ తెగకు చెందిన అరంబాయ్ తెంగోల్ వర్గం కీలక నేత కానన్ సింగ్‌తో పాటుగా మరి కొందరిని శనివారంనాడు అరెస్టు చేయడంతో మరోసారి ఘర్షణలు మొదలయ్యాయి. కానన్ సింగ్‌కు మెయితీలలో గట్టి పట్టు ఉంది. అయితే మణిపూర్ హింసాకాండలో పాత్ర ఉందన్న ఆరోపణలతో ఆయనను అరెస్టు చేశారు. కానన్ సింగ్‌ను అరెస్టు చేసినందుకు నిరసనగా ఆందోళనకారులు ఆదివారం రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. నిషేధాజ్ఞలను సైతం లెక్కచేయకుండా ఆందోళనలు చేశారు. తమ నాయకుడిని విడుదల చేయాలంటూ కొందరు వంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటామని బెదిరించారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను రద్దు చేశారు. కొన్ని చోట్ల కర్ఫ్యూను సైతం విధించారు.మరోవైపు మణిపూర్‌లో తాజా హింసాకాండపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో రెండు రోజులుగా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. కేంద్రం పిలుపు మేరకు మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ అమిత్‌షాతో చర్చలు జరపడం కోసం సోమవారం ఢిల్లీకి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. అయితే మణిపూర్ అల్లర్లు ఇప్పటికిప్పుడు మొదలైనవి కావు. గత రెండేళ్లుగా అక్కడ కుకీ గిరిజనులు, మైదాన ప్రాంతానికి చెందిన మెజారిటీ మెయితీల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అల్లర్లలో 260 మందికిపైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలా మంది ఇప్పటికీ శరణార్థి శిబిరాల్లోనే తలదాచుకుని ఉన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సొంతపార్టీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినా పరిస్థితులు కొలిక్కి రాలేదు.కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను గవర్నర్‌గా నియమించడంతో రాష్ట్రంలో శాంతి నెలకొంటుందని అందరూ భావించారు. గత ఫిబ్రవరిలో రాష్ట్రపతిపాలన అమలులోకి వచ్చాక రాష్ట్రం కాస్త శాంతించినట్లు కనిపించినా ఇప్పుడు మళ్లీ హింసాకాండ మొదలైంది. మైదాన ప్రాంతాలకు చెందిన మెజారిటీ మెయితీ తెగ తమకు కూడా గిరిజన హోదా కల్పించాలని గత కొన్నేళ్లుగా ఆందోళన చేస్తూ వస్తున్నారు. దీన్ని కొండ ప్రాంతాలకు చెందిన కుకీ తెగ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మెయితీలకు గిరిజన హోదా కల్పించినట్లయితే తమ ప్రాంతాలపై వారి ఆధిపత్యం మొదలవుతుందని, తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందనేది వారి భయం. అయితే మెయితీలకు గిరిజన హోదా కల్పించాలని రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ 2023 మేలో మణిపూర్ హైకోర్టు తీర్పునివ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.దీంతో ఒక్కసారిగా రాష్ట్రం అగ్నిగుండంగా మారింది. మెయితీ తెగకు చెందిన గ్రామాలపై కుకీలు దాడి చేయడం, కుకీలకు చెందిన మహిళలను మెయితీ వర్గం ప్రజలు చెరబట్టడం, పలువురు హత్యకు గురికావడంతో మణిపూర్ అంతటా ఉద్రిక్తత నెలకొంది.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తమ పార్టీకే చెందిన బీరెన్ సింగ్ ప్రభుత్వంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా పరోక్షంగా ఆయనకు



మద్దతుగా నిలిచింది. విపక్షాలన్నీ బీరెన్ సర్కార్‌ను తప్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఒక్కసారి కూడా మణిపూర్‌లో పర్యటించి అక్కడి ప్రజలకు భరోసా కల్పించలేదు. పైగా ప్రతిపక్షాలకు చెందిన నేతలు మణిపూర్‌లో పర్యటించడానికి యత్నిస్తే అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నించారు. అయితే రానురాను పరిస్థితి చేయిదాటి పోతోందని భావించిన కేంద్రం చివరికి బీరెన్ సింగ్‌ను పదవినుంచి తప్పించినప్పటికీ రాష్ట్ర అసెంబ్లీని రద్దు చేయకుండా సుప్త చేతనావస్థలోనే ఉంచింది.అంటే రాష్ట్రంలో మామూలు పరిస్థితులు ఏర్పడితే మళ్లీ బిజెపి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలన్నది కేంద్రం ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇటీవల మణిపూర్‌కు చెందిన పలువురు బిజెపి ఎంఎల్ఎలు ఢిల్లీలో అమిత్ షాను కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడమే దీనికి నిదర్శనం. మణిపూర్ ఉద్రిక్తతలను కేంద్రం ఇప్పటికీ శాంతిభద్రతల సమస్యగానే చూస్తుండడం విచారకరం. రాష్ట్రంలో రెండు బలమైన తెగల మధ్య కొనసాగుతున్న హింసాకాండకు శాశ్వతంగా ముగింపు పలికే దిశగా చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పని చేసిన భల్లాకు రాష్ట్రంలోని పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఉంది.కేంద్రం కూడా రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే బాధ్యతను పూర్తిగా ఆయనకు అప్పజెప్పింది. అయితే గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు గడిచినప్పటికీ భల్లా ఇరువర్గాలతో శాంతి చర్చలకు ప్రయత్నం చేయకపోవడం ఆశ్చర్యకరం.మరోవైపు గత రెండేళ్ల కాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన ప్రధాని మణిపూర్‌లో ఒక్కసారి కూడా పర్యటించకపోవడంపై రాజకీయ పార్టీలేకాక మేధా వివర్గాలు కూడా విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశానికి ప్రధానిగా అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాల్సిన మోడీ సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌ను మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనేది ఎవరికీ అంతుబట్టని విషయంగా మారింది. చిన్న రాష్ట్రమైనా సరిహద్దు రాష్ట్రంగా దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది.పైగా సుదీర్ఘ కాలం శాంతిభద్రతల సమస్య కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రజలు సైతం అభద్రతా భావంతోనే రోజులు వెళ్లదీస్తున్నారు.

## జగన్‌ను దేవుడు కూడా క్షమించడు

నెల్లూరు, జగన్ రెడ్డిని దేవుడు కూడా క్షమించడు అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు .. జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును జగన్ రెడ్డి ఖండించడంతో ఆడపడుచుల పట్ల ఆయనకున్న ఆలోచనలు బయటపడ్డాయన్నారు. విశ్లేషకుడిగా కృష్ణంరాజు తెలుగు ఆడపడుచుల గురించి నీచాతినీచంగా, క్రూరంగా మాట్లాడుతుంటే ఆ క్షణమే ఖండించి, క్షమాపణ చెప్పించి, డిబేట్ నుంచి బహిష్కరించాల్సిన బాధ్యత కొమ్మినేనితో పాటు యాజమాన్యానికి లేదా..? అని ప్రశ్నించారు.. ఆ పని అప్పుడు చేసివుంటే ప్రజలు హర్షించేవారు. అది చేయకపోగా వ్యంగ్యంగా నవ్వుతూ ఆ విశ్లేషకుడిని సమర్థించడం అందరూ చూశారని గుర్తుచేశారు.. అప్పట్లో వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వారిపై జగన్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడంతోనే ఇప్పుడు 11 సీట్లకు పరిమితమయ్యాడని మండిపడ్డారు.. ఈ రోజు ఆడపడుచుల పట్ల తన మనస్సులోని వైఖరిని బయటపెట్టాడు. ఇక జగన్ రెడ్డిని దేవుడు కూడా క్షమించరు అంటూ ఫైర్ అయ్యారు.

## బెట్టింగ్ యాప్‌కు మరొకరు బలి

రాజన్న సిరిసిల్ల, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల మరణాలు ఆగడం లేదు. బెట్టింగ్ యాప్‌లపై నిషేధమున్నా ఫోన్‌లో రోజుకో 4 కొత్త బెట్టింగ్ యాప్స్ పుట్టుకురావడంతో.. యువకులతో పాటు ఉద్యోగులు వాటి బారినపడుతున్నారు. అదేపనిగా బెట్టింగ్ పెడుతూ.. ఉన్నదంతా పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆస్తులు తాకట్టుపెట్టి, లోన్ యాప్‌లలో అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. అప్పులు, లోన్లు ఇచ్చినోళ్ల వేధింపులు భరించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. తాజాగా మరో యువకుడు బెట్టింగ్ యాప్ భూతానికి బలయ్యాడు. అత్యాశకు బెట్టింగ్ యాపుల్లో పందెలు పెట్టి.. నష్టాలు రావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లె గ్రామానికి చెందిన తుమ్మల వంశీ (25) కరీంనగర్‌లో వీల్ అలైన్మెంట్ మెకానిక్ వర్క్ చేస్తుంటాడు. ఈ క్రమంలో బెట్టింగ్ మోజులో పడిన వంశీ.. రూ.10 లక్షల వరకు అప్పులు చేసి బెట్టింగ్ పెట్టాడు. బెట్టింగ్‌లో లాస్ రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురయ్యాడు. ఇక చేసేదేమి లేకపోవడంతో సోమవారం పొలం దగ్గర చెట్టుకు ఉరివేసుకొని వంశీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చేతికి అందొచ్చిన కొడుకు బెట్టింగ్ భూతానికి బలికావడంతో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## చర్చనీయాంశంగా లేఖ...

నల్లగొండ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు నిరాశే మిగిలింది. మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని అందులో జిల్లా నేతలు ఇద్దరికి చోటు దక్కుతుందని కొంతకాలంగా పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అధిష్టానం కూడా ఆ దిశగా ఆలోచన చేయడంతో జిల్లాకు పక్కా మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ ఆదివారం ప్రకటించిన మంత్రివర్గంలో జిల్లా నేతలకు చోటు దక్కకపోవడంతో ఆశ నిరాశగానే మిగిలిపోయింది. అయితే మంత్రివర్గంలో మరో మూడు స్థానాలు ఖాళీగా ఉన్న నేపథ్యంలో మరోసారి జరిగే మంత్రివర్గ విస్తరణలోనైనా? అవకాశం దక్కుతుందా? ముఖ్యంగా ఎప్పటినుంచో మంత్రి పదవి ఆశిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇస్తారా? అన్న దానిపై జిల్లాలో జోరుగా చర్చసాగుతోంది.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి వర్గంలో దక్కని చోటు

ఈసారి మంత్రి వర్గ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కలేదు. ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినందునే ఆయన బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారన్న చర్చ జరిగింది. అయితే మొదటి మంత్రివర్గంలో రాజగోపాల్‌రెడ్డి సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చోటు దక్కడంతో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవి ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గు చూపకపోవడంతో రాజగోపాల్‌రెడ్డికి అప్పట్లో చోటు దక్కలేదు. ఇక పార్లమెంట్ ఎన్నికల సమయంలో అధిష్టానం రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడి భువనగిరి ఎంపీ గెలుపు బాధ్యతను ఆయనకు అప్పగించింది. ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆయన అన్నీ తానై ఆ బాధ్యతను భుజాన వేసుకుని భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించారు. దీంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని కాంగ్రెస్ వర్గాలతో పాటు జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది.

వాయిదా పడుతూ విస్తరణ..

పార్లమెంట్ ఎన్నికల నాటినుంచి మంత్రివర్గ విస్తరణ రేపు మాపు అంటూ వాయిదా పడుతూ వచ్చింది. ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ వార్తలు వెలువడినా.. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని ఆయన అనుచరులు నమ్మకంతో ఉన్నారు. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. దీంతో ఆయన అలకవహించినట్లు చర్చ జరగడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆయనను బుజ్జగించేందుకు ప్రయత్నించినా ఆదివారం రాత్రి వరకు వారికి అందుబాటులోకి రాలేదు.

బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్

ఇస్తారని మొన్నటి వరకు చర్చ మరోవైపు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ లంబాడా కోటాలో మంత్రి పదవిని ఇవ్వాలని గతంలోనే అధిష్టానాన్ని అడిగారు. ఆ దిశగా అధిష్టానం కూడా మొగ్గు చూపినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. జిల్లాకు ఇప్పటికే ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నందున, మరో రెండు మంత్రి పదవులు ఇస్తే ఇతర సమస్యలు వస్తాయన్న ఆలోచనతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి, బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ ఇస్తారని అసెంబ్లీ సమావేశాల సమయంలో జోరుగా చర్చ సాగిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఇద్దరిలో ఏ ఒక్కరికి కూడా బెర్తు దక్కలేదు.

చర్చనీయాంశంగా మారిన జానా లేఖ

రెండు నెలల కిందట మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని విస్తృత ప్రచారం జరిగింది. అదే సమయంలో రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి అధిష్టానానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దాంతో రాజగోపాల్‌రెడ్డి ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. కొన్నాళ్ల తరువాత ఆ చర్చ సద్దుమణిగినా ప్రస్తుతం విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి, బాలునాయక్‌కు పదవులు దక్కలేదు.

## మహిళలను కించపరిచిన వారికి శిక్ష పడాల్సిందే

అమరావతి, అమరావతి మహిళలను కించపరిచిన వారికి శిక్ష పడాల్సిందే అని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. సాక్షి మీడియాలో రాజధాని మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఎవరూ సమర్థించరని పేర్కొన్నారు. అమరావతికి కులం, మతం ఆపాదించడం సరికాదన్నారు. ఇక్కడి ఆడవాళ్లు ఏం తప్పు చేశారని ప్రశ్నించారు. రాజధాని కోసం భూములు ఇవ్వడమే వాళ్లు చేసిన తప్పా?అని నిలదీశారు. వాక్ స్వాతంత్ర్యం పేరుతో మహిళలను నోటికొచ్చినట్లు- మాట్లాడితే ఊరుకునేది లేదు. అమరావతి రైతులు సాక్షి మీడియాను ఏమైనా అన్నారా? వాళ్లు మళ్లీ రోడ్డెక్కే పరిస్థితిని సాక్షి మీడియా

# రాజగోపాల్ రెడ్డికి హ్యాండ్..!! అందుకేనా?



హైదరాబాద్, సామాజిక న్యాయం అనుసరించి మంత్రివర్గ విస్తరణ సజావుగా అమలైనట్టేనా? ఈ విస్తరణ ద్వారా తెలంగాణ సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నట్టు? కులాల వారీగా, ప్రాంతాల వారీగా భర్తీ జరిగినట్టే భావించాలా? అసంతృప్తుల మాటేమిటి? మిగిలిన జిల్లాల పరిస్థితి ఏమిటి? మొత్తం మంత్రి వర్గంలో కవరైన కులాలేంటి? ప్రాతినిథ్యం లభించని కులాల మాటేమిటి?

కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం

తెలంగాణ కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం దక్కింది. వీరిలో గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు రేవంత్ ప్రభుత్వం ఛాన్స్ కల్పించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ఆదివారం- రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. కొత్త మంత్రులకు త్వరలో శాఖల కేటాయింపు చేసే అవకాశాలు ఉన్నాయి.

కొత్త మంత్రులకు సీఎం రేవంత్ అభినందనలు

ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులు.. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకి అభినందనలు చెప్పారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రామచంద్రనాయక్‌కు కూడా ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రనాయక్

తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల్లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం గిరిజన జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని రామచంద్రనాయక్ తెలిపారు. డోర్నకల్ ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సహచర ఎమ్మెల్యేలకు రామచంద్రనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని రామచంద్రనాయక్ పేర్కొన్నారు.

సీఎం హామీ మేరకు మహబూబ్ నగర్ నుంచి శ్రీహరి

మహబూబ్ నగర్ నుంచి వాకిటి శ్రీహరి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. సిఎం రేవంత్ హామీ .. ప్రకారం ఈ కేబినేట్ బెర్త్ దక్కినట్టు తెలుస్తోంది. ఇక వివేక్ వెంకట స్వామి, మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్ బాబు ఎస్సీ- మాల సామాజిక వర్గానికి చెందిన వారు. అడ్లూరి లక్ష్మణ్ మాదిగ సామాజిక వర్గం .. కాంగ్రెస్ పార్టీకి ఎప్పటి నుంచో లాయల్ గా ఉన్నారు. ఇప్పటికే మాదిగ ఉపకులానికి చెందిన దామోదరరాజనర్సింహ మంత్రి వర్గంలో ఉన్నారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు.. నాలుగు సార్లు గెలిచిన తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడం పై ఆయన అలకబూనారు.. రాజీనామా చేస్తానని కూడా అన్నారు సుదర్శన్ రెడ్డి. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్- మినాక్షి నటరాజన్ పీసీసీ చీఫ్- మహేష్ గౌడ్ , సింఎం సలహాదారు- వేం నరేందర్ రెడ్డి.. కలసి సుదర్శన్ రెడ్డిని బుజ్జగించారు. ప్రేమ్ సాగర్ రావు ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఆశించారు. ఈయన్ని కూడా రాష్ట్ర పార్టీ నాయకత్వం బుజ్జగించింది.

ఎప్పటి నుంచో పదవినాశించిన రాజగోపాల్ రెడ్డి

మంత్రి పదవి ఎప్పటి నుంచో ఆశిస్తూ వచ్చిన.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందుబాటులోకి రాలేదు.. చిలుకూరు ఫార్మ్ హౌస్ లో ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రి పదవి దక్కక పోవడం పై ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అధిష్టానం హామీ ఇచ్చినా పదవి ఎందుకు దక్కలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సైతం సేమ్ సీన్.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం దక్కకపోవడం పై తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రాహుల్ గాంధీకి , ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే కు లేఖ రాశారు.

మొత్తం మంత్రి వర్గంలో

మొత్తం మంత్రి వర్గంలో.. ఓసి- రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి.. రేవంత్ రెడ్డి, పొంగులేటి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన శ్రీధర్ బాబు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన తుమ్మల, వెలమ సామాజిక వర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి, స్పీకర్ ప్రసాద్ కుమార్, వివేక్ వెంకట స్వామీ ఉన్నారు. ఇక ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర్ రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ మంత్రివర్గంలో ఉన్నారు. ఇక ఎస్టీ కోయ- సామాజిక వర్గం నుంచి సీతక్క, ఎస్టీ లంబాడ వర్గం నుంచి డిప్యూటి స్పీకర్ రామచంద్రు నాయక్ ప్రాతినిత్యం వహిస్తున్నారు. బీసీల నుంచి పొన్నం , కొండా సురేఖ, వాకిటి శ్రీహరి మంత్రి వర్గంలో ఉన్నారు.

పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

ఈసారి తెలంగాణ కేబినెట్ విస్తరణలో కాంగ్రెస్‌లో మంత్రి పదవులు ఆశించి పలువురు నేతలు భంగపడ్డారు. వారిని అగ్రనేతలు బుజ్జగిస్తున్నారు. పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సర్దిచెబుతున్నారు.

సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు

కాంగ్రెస్‌లో మంత్రి పదవులు దక్కని వారు తీవ్ర అసంతృప్త జ్వాలల పరిణామం ఎలా ఉండనుంది? అన్న చర్చ జోరుగా సాగుతోంది. మరీ ముఖ్యంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావులు తమకు కేబినెట్‌లో స్థానం తప్పక ఉంటుందని ఆశించారు. ఇదే విషయాన్ని తరచూ అనుచరులు, కార్యకర్తలతో చెప్పుకుంటూ వచ్చారు. చివరకు అనూహ్యంగా వారికి అధిష్టానం మొండిచేయి చూపడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ క్రమంలో వీరిని బుజ్జగించేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు.

వీరెలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న సస్పెన్స్

తాజాగా సుదర్శన్ రెడ్డి ఇంటికి తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెళ్లి బుజ్జగించారు. కానీ ఆ అసంతృప్తి జ్వాల అంత తేలిగ్గా చల్లారేది కాదు. ప్రేమ్‌సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ నడుస్తోంది.

మల్ రెడ్డితో పాటు బీర్ల ఐలయ్య సైతం గుర్రుగానే

ఇక, మరో కాంగ్రెస్ సీనియర్ నేత మల్‌రెడ్డి రంగారెడ్డి సైతం మంత్రి పదవి ఆశించి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాస్తానని చెప్పుకొచ్చారు. ఇంకో నేత బీర్ల ఐలయ్య సైతం.. అధిష్టానంపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశం శనివారం రోజంతా చర్చనీయాంశమైంది.

కవ్వంపల్లా, అడ్లూరా? అన్న ఉత్కంఠకు తెర

మాదిగ సామాజికవర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లేదా కవ్వంపల్లి సత్యనారాయణకు అవకాశం లభించవచ్చని చర్చల మధ్య అడ్లూరికి స్థానం దక్కింది. ఇక, రెడ్డి సామాజికవర్గానికి ఈసారి విస్తరణలో అవకాశం లేదనే చర్చ మొదటి నుంచీ జరిగింది. ఒకవేళ చోటు లభిస్తే మాత్రం నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత సుదర్శన్ రెడ్డికే ఎక్కువ అవకాశాలున్నాయనే వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంగతి సరే సరి.

ఆరింట మూడు ఖాళీలు మాత్రమే భర్తీ

నెలల తరబడి వాయిదాలు పడుతూ వస్తున్న తెలంగాణ కేబినెట్? విస్తరణ సగం మాత్రమే పూర్తయింది. ఆరు పదవులు భర్తీ చేయాల్సి ఉండగా తర్జనభర్జనలు పడి చివరకు మూడు పదవులు భర్తీ చేశారు. వీరిలో గడ్డం వివేక్? పట్ల గతంలో వ్యతిరేకత వచ్చినా కూడా కులాల లెక్కల ప్రకారం ఆయనకు మంత్రి పదవి లభించింది. ఆర్థికంగా ఆయన బలమైన నాయకుడు కావడం, చేతిలో మీడియా ఉండటం కూడా ఒక కారణం కావొచ్చంటున్నారు. ఆయన బీజేపీ నుంచి కాంగ్రెసులోకి వచ్చారు. అయినప్పటికీ కరుణించారు. మిగతా ఇద్దరూ తొలిసారి ఎమ్మెల్యేలు.

మూడింటికి 18 నెలలు, మిగిలిన మూడెప్పుడు?

ఇదిలా ఉంటే ఇప్పుడు చర్చంతా మిగిలిన మూడు పదవుల గురించే. ఆరింట మూడు పదవులు భర్తీ చేయడానికే పద్దెనిమిది నెలలు పట్టింది. మిగిలిన మూడు పదవులు భర్తీ ఎప్పుడు చేసినా.. పోటీ మాత్రం తీవ్రంగానే ఉండేలా తెలుస్తోంది. ఇందులో మరో స్ట్రాటజీ కూడా కనిపిస్తోంది. మూడు పదవులు మాత్రమే భర్తీ చేయడంతో ఒక సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు.. కొందరి ఆశలు ఇంకా సజీవంగానే ఉండొచ్చని అంచనా. ఇది ఆశావహులను ఊరటనిచ్చే అంశంగానూ తెలుస్తోంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి మంత్రి పదవిని ఆశించిన వారిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలున్నారు. వీరి కలలింకా నెరవేరలేదు.

రాజగోపాల్ కి చామలను గెలిపిస్తే మంత్రి పదవన్న హామీ?

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి హామీ ఇచ్చినట్టు చెబుతారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్?కుమార్? రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి గ్యారంటీగా రేవంత్? రెడ్డి ఆశ పెట్టారని అంటారు. దీంతో ఆయన ఎప్పటి నుంచో ఈ పదవి కోసం వెయిట్? చేస్తున్నారు. గతంలో కొన్నిసార్లు కేబినెట్? విస్తరణ అనుకున్నప్పుడు రాజగోపాల్? రెడ్డి పేరు తెర మీదికి వచ్చింది కూడా. తనకు ఎప్పటి నుంచో హోం మంత్రిగా చేయాలని ఉందని బాహటంగానే చెప్పారాయన. కాబోయే హోం మంత్రి ఆయనేనంటూ అందరూ అనుకున్నారు కూడా. కానీ ఆ కల ఇప్పటి వరకూ నెరవేరనేలేదు.

మిగిలిన మూడు పదవు భర్తీలో సామాజిక సందేశమేంటి?

ఇక ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి సైతం మంత్రిపదవులను ఆశించిన వారిలో ఉన్నారు. వీరికి కూడా చివరికి చోటు దక్కలేదు. మొత్తానికైతే.. ముగ్గిరికి మాత్రమే పదవులిచ్చి.. మిగిలిన మూడు పదవులను అలాగే ఉంచారు. ఈ తర్వాతి భర్తీలో ఎలాంటి ప్రాంతీయ సమతుల్యత పాటిస్తారు? సామాజిక సమీకరణాలను లెకిస్తారు? తేలాల్సి ఉంది. అయితే ఈ హాఫ్ భర్తీ ఫార్ములా ఎవరిదన్న చర్చ కూడా నడుస్తోంది పార్టీలో.

# ఏడాది ఎమ్మెల్యేలు: 30 పర్సంట్ డ్రాబాక్..!



అమరావతి,రాష్ట్రంలో కూటమి పార్టీల ఎమ్మెల్యేల పనితీరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న దరిమిలా.. ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. అయితే.. ఈ ఏడాది కాలంలో ఓ పది నుంచి 15 మంది మినహా.. ఇతర ఎమ్మెల్యేల తీరు ఆశించినంత తీరులో లేదన్నది ప్రజలు చెబుతున్న మాట. అంతేకాదు.. ఏడాది కాలంలో వారి గ్రాఫ్ 30 శాతం మేరకు తగ్గిందన్న విషయం కూడా చర్చకు వస్తోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 80 మంది కొత్తవారు విజయం దక్కించుకున్నారు. అయితే.. వీరిలో దాదాపు 70 శాతం మంది అసలు ఇప్పటి వరకు ప్రజల మధ్యకు రాలేదని తెలుస్తోంది.మరోవైపు కూటమి పార్టీల్లోనూ టీడీపీకి చెందిన 134 మందిలో మంత్రులను పక్కన పెడితే.. మిగిలిన వారిలోనూ 72 శాతం మంది ప్రజలకు దూరంగానే ఉంటున్నారు. కొందరు మాత్రమే ప్రజల మధ్యకు వస్తున్నారు. కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో గ్రాఫ్ తగ్గుముఖం పట్టిందన్నది వాస్తవం. నిజానికి పైస్థాయిలో చంద్రబాబు విషయంలో ఉన్న నమ్మకం.. విశ్వాసం వంటివి క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలపై కనిపించకపోవడం గమనార్హం. అంతేకాదు.. వారితో ప్రజలకు కూడా అనుబంధం దాదాపు తక్కువగా నే ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చంద్రబాబు పదే పదే మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా హెచ్చరించారు.అందరూ ప్రజల్లోనే ఉండాలని కూడా చెప్పారు. కానీ, పరిస్థితి పైకి చెప్పుకొంటున్నట్టుగా అయితే లేదు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు కొంత మేరకు ఆఫీసులు నిర్వహిస్తున్నారు. తమ వద్దకు వచ్చే వారిని అడ్రస్ చేసేందుకు ఆఫీసులో ఒకరిద్దరు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. కానీ.. నగరాలకు దూరంగా.. మన్యం సహా ఎస్సీనియోజకవర్గాల పరిస్థితి మాత్రం తీవ్ర ఇబ్బందిగానే ఉంది. అక్కడ ప్రజలకు ఎమ్మెల్యేలు కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. గత ఎన్నికల సమయంలో మన్యం సహా.. ఎస్సీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాలను ఎన్నికలు ముగిసిన వెంటనే తీసేశారు.దీంతో తమ ఎమ్మెల్యేలను కలుసుకునేందుకు వచ్చే ప్రజలునానా ప్రయాస పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు.. అసలు వచ్చినా.. ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండడం లేదన్న చర్చ కూడా ఉంది. కురుపాం, పాలకొండ వంటి నియోజకవర్గా లుఈ జాబితాలో ముందు వరుసలో ఉండగా.. శింగనమల నియోజకవర్గంలో ఒకే ఒక్క కార్యాలయం అందుబాటులో ఉంది. ఇలాంటివి చాలానే ఉన్నాయి. దీంతో ప్రజలకు-ఎమ్మెల్యేలకు మధ్య కనెక్టివిటీ బాగా తక్కువగా ఉందన్న టాక్ జోరుగానే వినిపి స్తోంది. దీంతో గత ఎన్నికల సమయంలో ఉన్న గ్రాఫ్ 100 శాతం అనుకుంటే.. ఇప్పుడు అది 70 శాతానికి తగ్గుముఖం పట్టిందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

# ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే రేవంత్ సర్కార్ బోల్తా..

హైదరాబాద్, 'ఆదిలోనే హంసపాదు' అన్నట్లుగా రేవంత్ రెడ్డి సర్కారుకు 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే బోణీ సరిగాలేదు. చిల్లర ఖర్చులకు నకనకలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే ఆదాయానికి చేసే ఖర్చుకు పొంతన లేదు. ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల అయిన ఏప్రిల్-2025 జమా ఖర్చులను కాగ్‌కు జూన్‌లో సమర్పించింది. వాటిని పరిశీలిస్తే మొదటి నెలలోనే రూ.4023.11 కోట్ల రెవెన్యూ లోటు ఉన్నట్లు రిపోర్ట్ స్పష్టం చేసింది. ఖర్చులకు కోసం భారీ ఎత్తున అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తెలంగాణ ప్రభుత్వానికి ఏప్రిల్ నెలలో రూ.10,916 కోట్ల ఆదాయం వస్తే రూ.16,466 కోట్లు ఖర్చు చేసింది. దీంతో ఖర్చులకు డబ్బులు లేక ఏకంగా రూ. 5230 కోట్ల అప్పు చేసింది. గత ఏడాది ఏప్రిల్ నెలలో రూ.2246.62 కోట్ల అప్పు తెస్తే.. ఈ ఏడాది అది ఏప్రిల్‌లో అది రూ.5230 కోట్లు ఉండటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదికి బడ్జెట్‌లో రూ.2,738 కోట్ల మిగులు చూపించింది. కానీ ఏప్రిల్‌లోనే ఏకంగా రూ.4,023 కోట్ల లోటులోకి వెళ్లడం రాష్ట్ర ఆరోగ్య స్థితికి మంచిది కాదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

తగ్గిన ఆదాయం ఇలా..

రేవంత్ సర్కారుకు ఖర్చులు భాగా పెరిగి ఆర్థిక లోటుతో 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనట్టు కాగ్ నివేదిక వెల్లడిస్తోంది. ముఖ్యంగా సబ్సిడీలు అత్యధికంగా పెరిగాయని, పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు, పన్నేతర ఆదాయం కూడా బాగా తగ్గిందని కాగ్ తెలియజేసింది. 2024 ఏప్రిల్‌లో పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.11,464 కోట్ల ఆదాయం రాగా 2025 ఏప్రిల్‌లో రూ.10916 కోట్లు మాత్రమే వచ్చింది. గత ఏడాది కంటే రూ.548 కోట్లు తగ్గిందని కాగ్ నివేదిక పేర్కొన్నది. పన్నేతర ఆదాయం గత ఏడాది ఏప్రిల్‌లో రూ.354.71 కోట్లు రాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.253.60 కోట్లు మాత్రమే. గత ఏడాదితో పోల్చితే.. రూ.101 కోట్లు తగ్గింది.

పెరిగిన ఖర్చు ఇలా..

ఖర్చులు మాత్రం అమాంతం పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో రూ.2777.29 కోట్లు ఉన్న రెవెన్యూ ఖర్చు ఈ ఏడాది రూ.3275.49 కోట్లకు పెరిగింది. వడ్డీ చెల్లింపులు సైతం రూ.1865.15 కోట్ల నుంచి రూ.2260.70 కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు గత ఏడాది రూ.3847.17 కోట్లు చెల్లించగా కొత్త నియామకాలతో ఈ ఏడాది రూ.3968.42 కోట్లకు పెరిగాయి. పెన్షన్ల చెల్లింపులు గత ఏడాది రూ.1331.75 కాగా ఈ ఏడాది రూ.1569.86 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది చాలా మంది పదవీ విరమణ చేయడం వల్ల పెన్షన్ల చెల్లింపు సంఖ్య ప్రతి నెల పెరిగే అవకాశం కనిపిస్తున్నది. ఆదాయమే లేని ప్రస్తుత పరిస్థితిలో సబ్సిడీల ఖర్చు ఏప్రిల్ నెలలో అమాంతం పెరిగింది. గత ఏడాది ఏప్రిల్‌లో సబ్సిడీల భారం రూ.976.97 కోట్లు కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా నాలుగు రెట్లు పెంచి రూ.4,187.73 కోట్లు ఖర్చు చేశారు.

క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పై భారీ తగ్గిన నిధులు

ఖర్చులు అమాతం పెరగడంతో రేవంత్ సర్కారు క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పై బాగా తగ్గించింది. సంపద సృష్టించాలంటే ఏ ప్రభుత్వాలైనా క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పైనే ఎక్కువ ఖర్చు చేయాలి కానీ దీనికి విరుద్ధంగా ప్రస్తుత ఖర్చుల విధానం ఉంది. గత ఏడాది ఏప్రిల్ నెలలో మూల ధన పెట్టుబడి రూ.3060.09



కోట్లు ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.1134.69 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఇది రూ.36,500 కోట్ల వార్షిక క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్ లక్ష్యంలో 3.3 శాతం మాత్రమే. గత ఏడాది కంటే అమాంతం రూ.1925.40 కోట్ల నిధుల ఖర్చు తగ్గించింది. ఇది ఎంత మాత్రం మంచిది కాదని, తెలంగాణ సంపద సృష్టికి సర్కారే అడ్డుగా ఉందా? అన్న సందేహం కలిగేలా ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆదాయం బాగా పడిపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ. 5,230 కోట్ల అప్పు తెచ్చిన సర్కారు, అప్పు తీర్చింది మాత్రం రూ.7.36 కోట్లే. గత ఏడాది ఇదే నెలలో రూ.150.10 కోట్ల అప్పు తీర్చిన విషయాన్ని కాగ్ గుర్తు చేసింది.

లక్ష్యానికి ఆమడ దూరంలో


%రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఆదాయం లక్ష్యం రూ. 2.29 లక్షల కోట్లుగా పెట్టుకున్నది. దీని ప్రకారం ప్రతి నెల రూ.19 వేల కోట్లకు పైగా ఆదాయం రావాలి. కానీ మొదటి నెలలోనే భారీగా పడిపోయి రూ.10916 కోట్లు మాత్రమే వచ్చింది. ఇది వార్షిక ఆదాయం లక్ష్యంలో 4.89 శాతంగా ఉన్నట్లు కాగ్ తెలిపింది. పన్నేతర ఆదాయం కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. పైగా మోదీ సర్కారు కక్షపూరితంగా వ్యవహరించడంతో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ కూడా రెండెంకెలు దాటడం లేదని కాగ్ నివేదిక ద్వారా స్పష్టం అవుతున్నది.

దిద్దుబాటు చర్యలు లేకుంటే..

సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటించకుంటే తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఘోరంగా దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పైసా అప్పు తేనన్న రేవంత్ అదే మాట మీద నిలబడి వచ్చిన ఆదాయం మేరకు ఖర్చులు చేయాలని సూచిస్తున్నారు. ఆదాయం పెంపు మార్గాలపై దృష్టి పెట్టకపోవడంతోనే ప్రతి ఏటా ఆదాయం పడిపోతున్నదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతున్నది. ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే భారీగా రెవెన్యూ లోటు రావడం అసాధారణమైనది. ఇది ఆందోళన కలిగించే అంశమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. విస్ఫోటం తరహాలో సబ్సిడీ వ్యయం పెరగడం, ఎక్సైజ్, నాన్ టాక్స్ వంటి సొంత ఆదాయాలు తక్కువగా నమోదు కావడం అనేది ఆర్థిక రంగంలో తుఫాన్ సృష్టించే అంశాలని అంటున్నారు. ఏప్రిల్ నివేదికను పరిశీలిస్తే అప్పులు పెరగడం వల్ల క్రెడిట్ రేటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు.

# కాళేశ్వరం కేసు.. హరీష్ రావు విచారణ పూర్తి..

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పై న్యాయ విచారణ జరుగుతోంది. ఈ విచారణలో భాగంగా సోమవారం మాజీ మంత్రి హరీష్ రావు జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఎదుట హాజరయ్యారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో జరిగిన ఈ విచారణ సుమారు 45 నిమిషాల పాటు సాగింది. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు హరీష్ రావు తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చారు. అసలు ఈ విచారణలో ఏం జరిగిందో వివరంగా తెలుసుకుందాం.విచారణ ప్రారంభంలో హరీష్ రావు ముందుగా కమిషన్ ఎదుట ప్రమాణం చేశారు. తాను తెలుగు మీడియం విద్యార్థిని కాబట్టి ఇంగ్లీష్ పూర్తిగా మాట్లాడలేనని అయితే అర్థం చేసుకోగలనని కమిషన్‌కు తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఇంగ్లీష్‌లో ఇబ్బంది ఉంటే హిందీలో మాట్లాడవచ్చు లేదా తెలుగులో చెప్పిన వాటిని అనువదించడానికి సిబ్బంది ఉన్నారని చెప్పారు. అయినప్పటికీ కొన్ని టెక్నికల్ అంశాలకు సంబంధించి హరీష్ రావు అధికారులు చూసుకున్నారు అని మాత్రమే సమాధానం ఇచ్చారు.కాళేశ్వరం ప్రాజెక్టు స్థలాన్ని తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు ఎందుకు మార్చారు అని కమిషన్ ప్రశ్నించింది. దీనికి హరీష్ రావు వివరణ ఇస్తూ.. సెంట్రల్ సర్వే ఆర్గనైజేషన్ వాప్‌కోస్, సాంకేతిక కమిటీ, హై పవర్ కమిటీ, క్యాబినెట్ సబ్-కమిటీ సిఫార్సుల ప్రకారమే ఈ మార్పు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ప్రధానంగా మహారాష్ట్ర అభ్యంతరాల కారణంగా తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు మార్చడం జరిగిందని అన్నారు. ఒకవేళ ఎత్తును 152 అడుగుల నుండి 148 అడుగులకు తగ్గిస్తే నీటి లభ్యత ఉండదని కేంద్ర జల సంఘం కూడా స్పష్టం చేసిందని హరీష్ రావు పేర్కొన్నారు.అంతేకాదు నాగార్జునసాగర్ ప్రాజెక్టును కూడా ఏలేశ్వరం నుంచి నందికొండకు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సమ్మక్క బ్యారేజీని కూడా గతంలో మార్చారని హరీష్ రావు గుర్తు చేశారు. హై పవర్ కమిటీ సిఫార్సు ప్రకారమే తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్పు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన అఫిడవిట్ సమర్పించారు. కాళేశ్వరం కార్పొరేషన్ కమిషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చింది అని కమిషన్ ప్రశ్నించగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో నిధుల విషయంలో ఇబ్బందులు ఉ



న్నందున కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని హరీష్ రావు వివరించారు.ప్రాజెక్టు నిర్మాణ ఖర్చును ఎలా భరించాలని అనుకున్నారు అని కమిషన్ అడిగింది. దీనికి హరీష్ రావు, సాగునీరు అందించడమే కాకుండా పరిశ్రమలకు నీరు అందించడానికి, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. కోకా-కోలా కంపెనీ నీటి అవసరాలను కూడా కాళేశ్వరం ద్వారా తీర్చాలని భావించినట్లు తెలిపారు. అయితే, కోవిడ్ కారణంగా కొన్ని కంపెనీలు ప్రాజెక్ట్ పరిధిలోకి రాలేకపోయాయని అన్నారు.బ్యారేజీలలో నీటిని నిల్వ చేయాలని ఎవరు సూచించారు అని కమిషన్ అడిగిన ప్రశ్నకు.. అది ఒక టెక్నికల్ అంశం అని, ఇంజనీర్లు తీసుకున్న నిర్ణయం అని హరీష్ రావు బదులిచ్చారు. కాళేశ్వరం బ్యారేజీలలో ఎంత నీటిని నిల్వ చేయవచ్చు అని కమిషన్ అడిగినప్పుడు, 140 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చని హరీష్ రావు చెప్పారు. పదవీ విరమణ పొందిన ఇంజనీర్ల సూచనల ప్రకారమే మేడిగడ్డను నిర్మించారని హరీష్ రావు స్పష్టం చేశారు. మహారాష్ట్ర అంగీకరించకపోవడం వల్లే తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు మార్చామని ఆయన వివరించారు. 16 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరు అందించాలంటే రిజర్వాయర్ల సంఖ్యను పెంచాలని సీడబ్ల్యూసీ చెప్పిందని అన్నారు. మేడిగడ్డ నిర్మాణం ఒక వ్యక్తి నిర్ణయం కాదని హరీష్ రావు కమిషన్‌కు తెలియజేశారు.

# సునీల్ నారంగ్ రాజీనామా..ఓ గుణపాఠం



హైదరాబాద్,తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన 24 గంటల్లోనే తన పదవికి రాజీనామా చేయడం హాట్ టాపిక్‌గా మారింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో టీఎఫ్‌సీసీకి కొత్తగా ఎన్నికైన పాలక మండలిని ప్రకటించారు. మూడోసారి అధ్యక్షుడిగా సునీల్ నారంగ్, కార్యదర్శిగా శ్రీధర్ సహా 15 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. అయితే టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా ఎన్నికై 24 గంటలు గడవక ముందే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనని సంప్రదించకుండానే కొందరు ప్రకటనలు ఇస్తున్నారని, తన ప్రమేయం లేకుండా ఇచ్చిన ప్రకటనలకు తాను బాధ్యుడిని కాదని, ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా పదవిలో కొనసాగలేనని పదవికి రిజైన్ చేసేశారు.నిజానికి సునీల్ నారంగ్‌కి ఆ పదవి వల్ల ఒరిగేది ఏమీ లేదు. ఆయకి బోలెడు వ్యాపారాలు వున్నాయి. సినిమా ఇండస్ట్రీపై కావాల్సినంత పట్టువుంది. ఎదో గౌరవార్థం అన్నట్టుగా ఆ పదవిలో వున్నారు. ఆయన లాంటి పట్టు వున్న వ్యాపారవేత్త ఆ పదవిలో వుంటే ఛాంబర్‌కే ప్లస్సు. అయితే తనకి లేనిపోని తలనొప్పులు తెచ్చిన ఆ పదవికి గుడ్‌బై చెప్పారు సునీల్. ఇక్కడితో ఆయన బాధ్యత తీరిపోయిందని అనడానికి లేదు. నిజానికి ఈ ఇష్యూలో నేర్చుకోవాల్సిన గుణపాఠం వుంది.సునీల్ నారంగ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి కారణం.. మొన్న జరిగిన ప్రెస్‌మీట్. ఆ ప్రెస్‌మీట్‌లో ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్ అసందర్భ ప్రేలాపనలు. కొందరికి మీడియా అంటే ఒక పాషన్‌గా మారింది. మీడియా ముఖ్య ఉద్దేశాన్ని పక్కన పెట్టి కొందరు వ్యక్తిగత దర్పం చూపించడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ క్రమంలో 'సబ్జెక్ట్'ని పక్కన పెట్టి మిగతా విషయాలన్నీ మాట్లాడుతుంటారు. మొన్న జరిగిన ప్రెస్‌మీట్‌లో కూడా అదే జరిగింది.తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కి ప్రతి రెండేళ్లకి ఓసారి ఎన్నికలు జరుగుతాయి. ఏవో చిన్న మార్పులు తప్పితే దాదాపు ఆ ఎన్నిక ఏకగ్రీవంగానే వుంటుంది. కొత్త కమిటీని ప్రెస్‌మీట్ పెట్టి అనౌన్స్ చేస్తారు. ఇది ఆ ప్రెస్‌మీట్ 'సబ్జెక్ట్'. కానీ మొన్న జరిగిన ప్రెస్‌మీట్‌లో సెక్రటరీ శ్రీధర్ సీక్రెట్ ఎజెండాతో వచ్చారు. ఎగ్జిబిటర్స్ ఇష్యూపై వకాల్తా పుచ్చుకున్నారు, పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందని థియేటర్స్ ఖాళీ పెట్టుకున్నాం ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి అని నిలదీశారు. రెండు కోట్లు రెవెన్యూ చేయలేని ఓ హీరో 13 కోట్లు తీసుకున్నాడని మరో ఆరోపణ చేశారు. ఆరు నెలల్లో మూడు సినిమాలు మాత్రమే హిట్ అయ్యాయని తీర్పు ఇచ్చారు. ప్రెస్‌మీట్ సబ్జెక్ట్‌కి ఈ ప్రకటనలకి ఎలాంటి సంబంధం లేదు. కడుపులో వున్న కుళ్లినంత కక్కేసినట్టుగా మాట్లాడారు.దిల్ రాజు, అల్లు అరవింద్ కూడా థియేటర్స్ బంద్ ఇష్యూ మీద ప్రెస్‌మీట్లు పెట్టారు. సబ్జెక్ట్‌కి కట్టుబడి మాట్లాడారు. పవన్ కళ్యాణ్ సినిమాని అడ్డుకునే ఉద్దేశం ఎవరికీ లేదని సరిగ్గా కమ్యూనికేట్ చేశారు. కానీ తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెస్‌మీట్ మాత్రం చాలా వివాదాస్పదంగా సాగింది. సెక్రటరీ శ్రీధర్ మాట్లాడితే.. సునీల్ ఎందుకు రాజీనామా చేశారని అనుకోవచ్చు. ఒక జనరల్ బాడీ ప్రెస్‌మీట్ పెట్టినప్పుడు అందులో ప్రతిమాట ప్రెసిడెంట్‌కి వర్తిస్తుంది. ఆయన అనుమతితోనే శ్రీధర్ అలాంటి విమర్శలు చేసివుంటారనే అభిప్రాయం సహజంగానే వుంటుంది.

# మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం..



ముంబై: విద్యావిధానంలో ఏటా మార్పులు వస్తున్నాయి. సిలబస్ మారుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వాలు కూడా కీలక మార్పులు చేస్తున్నాయి. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, దేశభక్తి వంటి లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. ఈ నిర్ణయం సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది.మహారాష్ట్ర ప్రభుత్వం పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు సైనిక శిక్షణ అమలు చేయాలని యోచిస్తోంది. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు శారీరక ఫిట్‌నెస్, ఆత్మరక్షణ విద్యలు, టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలు ఉంటాయి. ఈ శిక్షణను నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) మాదిరిగానే రూపొందించినప్పటికీ, దీన్ని మరింత విస్తృతంగా, అన్ని విద్యా సంస్థల్లో అందుబాటులోకి తీసుకొచ్చే ఉద్దేశం ఉంది. ఈ కార్యక్రమం ద్వారా యువతలో జాతీయ సమైక్యత, దేశ సేవా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

ఈ నిర్ణయం వెనుక ఉద్దేశం..

ఈ కార్యక్రమం యువతలో క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తిని నింపడంతోపాటు, ఆధునిక సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందించడం కోసం రూపొందించబడింది. సైనిక శిక్షణ ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా బలోపేతం కావడంతోపాటు, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మారతారని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, ఈ శిక్షణ దేశ రక్షణ రంగంలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రాథమిక జ్ఞానాన్ని అందిస్తుందని, భవిష్యత్తులో సైనిక సేవల్లో చేరేందుకు ప్రోత్సాహం కల్పిస్తుందని అధికారులు అంటున్నారు.

సమాజంలో చర్చ..

ఈ నిర్ణయం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొందరు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, యువతలో క్రమశిక్షణ, దేశభక్తి పెరుగుతాయని అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం, విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, సైనిక శిక్షణ తప్పనిసరి చేయడం విద్యా స్వేచ్ఛను హరిస్తుందని వాదిస్తున్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, విద్యా షెడ్యూల్‌లపై ఈ కార్యక్రమం ప్రభావం గురించి కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమం అమలు సమయంలో విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

అమలు ప్రణాళిక..

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేయనుంది. మొదటి దశలో, ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించి, దాని ఫలితాల ఆధారంగా విస్తరణ చేయాలని యోచిస్తోంది. శిక్షణ కోసం అనుభవజ్ఞులైన సైనిక అధికారులు, ఎన్‌సీసీ శిక్షకుల సహకారం తీసుకోనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే, ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలవవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

యువత శక్తిని సానబట్టే ప్రయత్నం

మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా ఒక ముందడుగుగా భావించవచ్చు. అయితే, దీని అమలులో విద్యార్థుల ఆసక్తులు, విద్యా లక్ష్యాలను సమతుల్యం చేయడం కీలకం. ఈ కార్యక్రమం దీర్ఘకాలంలో దేశ యువతను బలోపేతం చేసే దిశగా ఎలాంటి ఫలితాలను ఇస్తుందో చూడాల్సి ఉంది.

## కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కమలాపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలంటూ కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 188 సెక్షన్‌ను కొట్టేసింది. పోలీసులు నమోదు చేసిన మిగతా సెక్షన్లలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఆదేశించింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో తనను గెలిపించకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీనిపై నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.

# కార్గో షిప్‌లో కొనసాగుతున్న పేలుళ్లు.. భారీగా మంటలు

కేరళ:కేరళలోని కన్నూర్ జిల్లాలోని అళిక్కల్ నుండి 44 నాటికల్ మైళ్ల దూరంలో సింగపూర్ కార్గో షిప్‌లో రెండో రోజు కూడా పేలుళ్లు కొనసాగుతుండటంతో పాటు భారీగా మంటలు చెలరేగుతున్నాయి.సింగపూర్ నుంచి వచ్చిన ఈ కంటైనర్ నౌకలో మంటలు ఊహించని విధంగా వ్యాపిస్తున్నాయి. అయితే, ఈ సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ట్రై చేస్తున్నారు. అయినప్పటికి కంటైనర్ నౌకలో ఉన్న వివిధ కెమికల్ పదార్థాల మూలంగా పేలుళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. దీంతో నాలుగు రెస్క్యూ బోట్లు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ.. మంటలు అదుపులోకి రావడం లేదని చెప్పుకొచ్చారు.అయితే, వసతి బ్లాక్‌కు ముందున్న మిడ్-షిప్ ప్రాంతం, కంటైనర్ బే నుంచి మంటలు చెలరేగుతున్నట్లు భారత కోస్ట్ గార్డ్ అధికారులు ఈ రోజు (జూన్ 10న) తెలిపారు. కాగా, ఈ అగ్ని ప్రమాద ఘటనపై అధికారులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తునే ఉన్నారు. మంటలు వ్యాపించకుండా నిరోధించడానికి భారతీయ కోస్ట్ గార్డ్ నౌకలు సముద్ర ప్రహరి, సాచెట్ సముద్రంలో అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టింది. అయితే, ఈ



ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలో షిప్‌లో దట్టమైన పొగ వ్యాప్తి చెందడం కనిపిస్తుంది. కాగా, ఈ ప్రమాదంలో మొత్తం 18 మందిని కోస్ట్‌గార్డ్ సిబ్బంది కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS,** H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS,** H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**